బేగంపేట్‌లో..

ఉప్పల్‌లో..

పేక్‌పేట/ఆదిత్య నగర్‌లో..

గోల్కొండ సెవెన్ టోంబ్స్..

వర్ష బీభత్సం

పంజాగుట్ట ఫ్లైఓవర్ పరిధిలో

నగరంలో మంగళవారం తెల్లవారుజామునుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులు చెరువులను తలపించాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపార్లాయి. ఇండ్లలోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలువడంతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు గంటల తరబడి రోడ్లపై నరకాన్ని చూశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు జరిమానాల కే పరిమితమయ్యారని పలువురు ఆరోపించారు.

మాసబ్ ట్యాంక్‌లో..

కొమురవెల్లి మల్లన్నకు బల్కంపేట ఎల్లమ్మ రాఖీ

వెండి రాఖీ, పట్టు వస్త్రాలతో ఎల్లమ్మ ఆలయ పాలక మండలి మాజీ సభ్యులు

అమీర్‌పేట్, ఆగస్టు 20: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్నకు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు పట్టు వస్త్రాలతో కూడిన వెండి రాఖీని పంపారు. మంగళవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పాలక మండలి మాజీ సభ్యులు దాసోజు పుష్పలత, ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్, గిరి యాదవ్, సరఫ్ సంతోష్, ఉప్పల యాదగిరి గుప్తా, గౌతమ్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, రోజారెడ్డి, ప్రభుగౌడ్ ఎల్లమ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి తరపున వెండి రాఖీ, పట్టు వస్త్రాలను తీసుకుని కొమరవెల్లి మల్లన్నకు అందజేసేందుకు తరలి వెళ్లారు.

పశుపోషకుల అభివృద్ధికి తోడ్పాటునందించాలి

మాట్లాడుతున్న పశుసంవర్ధక పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్

సుల్తాన్‌బజార్,ఆగస్టు 20: ఎన్ఎల్ఎం పథకంలో దరఖాస్తులు చేసుకున్న వారందరి పత్రాలను క్షుణ్ణంగా, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పశు పోషకుల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని రాష్ట్ర పశుసంవర్ధక పాడిపరిశ్రమ అభివృద్ధి,మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మాసబ్ ట్యాంక్ శాంతినగర్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎన్ఎల్ఎం పథకంపై వివిధ జిల్లా పశు వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎల్ఎం పథకం గురించి పశు వైద్యాధికారులు పశు పోషకులకు అవగాహన కల్పించి వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని అన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సంచాలకులు ఐఏఎస్ డాక్టర్ గోపీ, తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ మల్లీశ్వరి, గొర్రెల,మేకల పెంపకందారుల సమైఖ్య అధికారి డాక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎస్‌డీజీ అవార్డుల ప్రదానోత్సవం

అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

కొండాపూర్, ఆగస్టు 20 : అంగవైకల్యాన్ని జయించి, పలు రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురిని మంగళవారం నాలెడ్జ్‌సిటీలోని టీ – హబ్‌లో సత్కరించారు. ఫ్లైడ్ ఆఫ్ హైదరాబాద్ పేరిట నిర్వహిస్తున్న సస్టేనెబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అవార్డుల ప్రదానోత్సవానికి టీ – హబ్ సీఈవో శ్రీనివాస్ మహంకాళి ముఖ్య అతిథిగా హాజరై వీ – హబ్ సీఈవో సీతా పలచొల్లతో కలిసి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా, డీఐజీ టీసీసీ సిస్టర్ పరిమల్ హనసుథన్, జనసేన పార్టీ స్టేట్ హెడ్ మహిళా వింగ్ నిహారిక రెడ్డి, టీ – హబ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తలుక, టీ –వర్స్ సీఈవో జోగిందర్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి, పగలు కరెంట్ కోతలు

నిరసన తెలుపుతున్న ఆయా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 20: విద్యుత్ సరఫరాలో పదేపదే అంతరాయం తలెత్తడంతో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో మంగళవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలో పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెలగడ్డ చెరువు సమీపంలో ఉన్న డీఈ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా సాయిబాబా నగర్ ఫీడర్ ఛానల్ నుంచి ప్రతి రోజు రెండు గంటల పాటు రాత్రి పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారన్నారు. ఎంఎఎన్‌రెడ్డి కాలనీ అధ్యక్షుడు సూదుల సంపత్‌గౌడ్, బ్యాంకుకాలనీ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, న్యూవివేకానంద్‌నగర్ మాజీ అధ్యక్షుడు సత్తయ్యగౌడ్, ఎల్లాగౌడ్, బలరాం, పరమేశ్‌నాయి, శంకరయ్య, అంజయ్య, రవీందర్‌గౌడ్, సత్యరాం, రామాంజనేయులు, సంతోష్, డీజే ప్రసాద్, మాలాద్రి, నజీర్ పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

సదస్సులో పాల్గొన్న డాక్టర్ అమర్‌సింగ్ నాయక్,తదితరులు

బేగంపేట్, ఆగస్టు 20 : ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా మంగళవారం బేగంపేట్‌లోని సర్ రొనాల్డ్ రోస్ భవనంలో 'ఏ ఫైట్ ఎగైనెస్ట్ ఫర్ ఈక్విటబుల్ డిసీజెస్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఓయూ జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు డాక్టర్ అమర్‌సింగ్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి దోమల నివారణపై ప్రజల్లో పెంచాల్సిన అవగాహనపై చర్చించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులన్నీ కొద్ది పాటి జాగ్రత్తలతో నివారించవచ్చన్నారు. చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ దోమలు అభివృద్ధి చెందే తీరును తెలుసుకోవడం వల్ల వాటిని అరికట్టే వీలుందన్నారు. ఈ సదస్సులో కో–కన్వీనర్ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ప్రొ. కరుణసాగర్, ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వీరయ్య, పాల్గొన్నారు. అంతకు ముందు ప్రొఫెసర్ మాధవి రాసిన 'ఆర్థ్రోపోడ్ బోర్న్' అనే 3వ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సమాచారం

ఎల్ ఆర్ఎస్‌కు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 20 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు కలెక్టరేట్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్న హెల్ప్‌డెస్క్‌ల్లో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు అవసరమైన పత్రాలు ఇవ్వని పక్షంలో ఇప్పుడు ఎల్ఆర్ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, అవసరమైన మేరకు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అగ్రి కోర్సులకు 24న కౌన్సెలింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 20 : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ డిప్లొమా కోర్సులకు ఈ నెల 24న వర్సిటీలోని ఎగ్జామినేషన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రిజిస్ట్రార్ డా. రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 పాలిసెట్ ఆధారంగా ఈ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎసెస్సీ పాసైన వారికి రెండో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు రూ. 22,210 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, ఆగస్టు 20 : వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన బాలలకు 2025వ సంవత్సరంలో అందించనున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. 5 నుంచి 18 ఏండ్లలోపు ఉండి, ఇన్నోవేషన్, సామాజిక సేవ, ధైర్య సాహసాలు, పాండిత్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కళల వంటి రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. అర్హత ఉన్న వారు ఆన్‌లైన్‌లో 'నేషనల్ అవార్డ్సు పోర్టల్ http://awards.gov.inay ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత ప్రతిని జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

డ్రగ్ పెడ్లర్లతో జైళ్లన్నీ కిటకిట

- చంచల్‌గూడ, సంగారెడ్డి జైళ్లలోపరిమితి కంటే రెట్టింపు ఖైదీలు
- ఇతర జైళ్లలోనూ అదే పరిస్థితి
- పాత ఖైదీలకు తీవ్ర ఇబ్బందులు

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డ్రగ్స్ క్రయవిక్రయదారుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. దీంతో జైళ్లన్నీ వారితో కిటకిటలాడుతున్నాయి. రాష్ట్రంలోని 4 సెంట్రల్ జైళ్లు, 7 జిల్లా జైళ్లు, 29 సబ్ జైళ్లు, 2 మహిళా జైళ్లు, 3 ఇతర జైళ్లలో కలిపి మొత్తం 7,392 మంది ఖైదీలకు మాత్రమే సౌకర్యాలు ఉన్నాయి. 1,250 మందికి సౌకర్యాలున్న చంచల్‌గూడ సెంట్రల్ జైలులో ప్రస్తుతం 2,103 మంది, 220 మందికి సదుపాయలున్న సంగారెడ్డి జైలులో 569 మంది ఉన్నారు. ఇతర జైళ్లలోనూ పరిమితి కంటే 50 నుంచి 60 శాతం మంది ఖైదీలు అదనంగా ఉన్నారు. మొత్తంగా అన్ని జైళ్లలో కలిపి 7,667 మంది ఖైదీలను అదనంగా ఉంచారు. వీరిలో 2,023 మంది శిక్ష పడిన ఖైదీలు, 4,791 మంది అండర్ ట్రయల్ ఖైదీలు, 838 మంది రిమాండ్ ఖైదీలు, 15 మంది ఇతరులు ఉన్నారు. సాధారణ నేరస్థులతోపాటు మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరస్తులు, రిమాండ్ ఖైదీల రాకతో జైళ్లలో రద్దీ పెరిగిపోతున్నదని, దీంతో ఇప్పటికే జైళ్లలో ఉన్న ఇతర ఖైదీలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు చెప్తున్నారు. ఇటీవల హైదరాబాద్, సైబరాబాద్‌లకు చెందిన రిమాండ్ ఖైదీలను, ముఖ్యంగా డ్రగ్స్ నేరాలకు పాల్పడుతున్న వారిని చంచల్‌గూడ జైలుకు తరలించడంతో అక్కడ రద్దీ విపరీతంగా పెరిగింది. గతంలో ఎల్బీనగర్, రాజేంద్రనగర్, షాద్‌నగర్ కోర్టుల్లో రిమాండ్ అయిన ఖైదీలను హైదరాబాద్ శివారులోని చర్లపల్లి జైలుకు తరలించేవారు. ప్రస్తుతం రవాణా ఖర్చులు పెరగడం, ఖైదీలకు తగినంత భద్రతను కల్పించడంలో ఇబ్బందులు తలెత్తుతుండటంతో వారిని కూడా చంచల్‌గూడ జైలుకే తరలిస్తున్నారని, దీంతో గతంలో మూసివేసిన వీఐపీ బ్యారక్‌ను మళ్లీ తెలిచామని ఉన్నతాధికారులు వివరించారు. ప్రస్తుతం వరంగల్‌లో సెంట్రల్ జైలు లేకపోవడంతో అక్కడి ఖైదీలను హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్‌లోని జైళ్లకు పంపుతున్నట్టు తెలిపారు. సిద్దిపేటలో రూ.90 కోట్లతో చేపట్టిన జైలు నిర్మాణం పూర్తయితే కొంత ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు.

ముత్యంమరణంతీరనిలోటు

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ పోరాటంపై పరిశోధన చేసి, విప్లవ సాహిత్యానికి ఎంతో కృషి చేసిన ముత్యం మరణం ప్రగతిశీల సాహిత్యానికి తీరని లోటని ప్రముఖ రచయిత జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిందు ఎల్లమ్మపై పుస్తకం వెలువరించి, దళిత బహుజన సాహిత్యానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమంలో తెలంగాణ రచయితల వేదిక జంట నగరాల అధ్యక్షుడిగా పనిచేసి తనవంతు పాత్ర నిర్వహించారని గుర్తుచేశారు.

'రాఖీ రాబడి' 32 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ) : రాఖీ పండుగ టీజీఎస్ఆర్టీసీకి మంచి ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. పండుగ రోజు ప్రయాణాలు సరికొత్త రికార్డు సృష్టించాయి. సోమవారం ఒక్కరోజే బస్సుల్లో 63.86 లక్షల మంది రాకపోకలు సాగించారు. మహాలక్ష్మి పథకం కింద 41.74 లక్షల మంది మహిళలు ఉచితంగా జర్నీ చేశారు. దీంతో రికార్డుస్థాయిలో ఆర్టీసీకి రూ.32 కోట్ల రాబడి వచ్చింది. ఇందులో మహాలక్ష్మి పథకం ద్వారా రూ.17కోట్లు, టికెట్ల ద్వారా రూ.15 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ విషయాన్ని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం స్వయంగా వెల్లడించారు. ఆర్టీసీ చరిత్రలోనే ఒక్కరోజులో ఇంత ఆదాయం ఎప్పుడూ రాలేదని తెలిపారు. భారీ వర్షంలోనూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసిన సిబ్బందిని మంత్రి అభినందించారు.

ఎండీ సజ్జనార్ కృతజ్ఞతలు..

రాఖీ రోజు ఆర్టీసీ బస్సులు రికార్డుస్థాయిలో 38 లక్షల కిలోమీటర్లు తిరిగాయని సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ ఒక్కరోజే 63 లక్షల మంది ప్రయాణించగా.. రీజియన్ల వారీగా హైదరాబాద్ 12.91లక్షలు, సికింద్రాబాద్ 11.68లక్షలు, కరీంనగర్ 6.37లక్షలు, మహబూబ్‌నగర్ 5.84లక్షలు, వరంగల్ 5.82లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చినట్టు వెల్లడించారు.

అజ్ఞాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20: స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పటి వరకు అత్యంత అజ్ఞాన ముఖ్యమంత్రిగా నిలిచిపోయే వ్యక్తి రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు ఎంత హుందాగా ప్రవర్తించాలో తెలియని అప్రకటిత మేధావి రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. అజ్ఞాని అధినేతగా మారితే విజ్ఞాని వీధుల్లో తిరగాల్సి వస్తుందని అన్నారు. తన సామర్థ్యం తెలుసుకోలేని వాడు తనని నాయకుడిగా భావించే వారందరినీ తెలియకుండానే నాశనం చేస్తాడని చదువుతుంటే తెలియడం లేదని, రేవంత్‌రెడ్డిని చూస్తేనే అర్థమవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేందుకు ముఖ్య కారణమైన అంబేద్కర్ పేరుని రాష్ట్ర సచివాలయానికి కేసీఆర్ పెట్టారని గుర్తు చేశారు. భారతదేశానికి భరత మాతలా తెలంగాణకు తెలంగాణ తల్లిని గౌరవించుకోవడం మన భారతీయ సంప్రదాయమన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ఎదుట పెట్టాలని కోరుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. అదికాకుండా సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం ఎలా ఆవిష్కరిస్తారని మండిపడ్డారు. ఇది సీఎం ఆధిపత్య ధోరణి, అహంకారానికి నిదర్శనమని అన్నారు.

అక్టోబర్‌లో ఫ్యాషన్ పోటీలు

ఖైరతాబాద్, ఆగస్టు 20 : నగరంలో మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ 2024 సీజన్–1ఫ్యాషన్ పోటీలను అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు కిరణ్మయి అలివేలు ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొన్న వారికి అవకాశం కల్పిస్తున్నామని, త్వరలోనే ఆడిషన్స్‌ను ప్రారంభిస్తామని, ఈ పోటీల్లో పాల్గొనే వారు www.sbtribe.orgలో వివరాలు పొందుపర్చాలన్నారు.

ఐస్ స్కేటింగ్‌లో రాష్ట్రం రెండో స్థానం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గురుగ్రామ్ వేదికగా జరిగిన 19వ ఐస్ స్కేటింగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రం తరపున బరిలోకి దిగిన స్కేటర్లు మూడు స్వర్ణాలు సహా నాలుగు కాంస్య పతకాలతో మెరిశారు. వీరిలో మహాన్యరెడ్డి రెండు స్వర్ణ పతకాలతో సత్తాచాటింది. పతకాలు సాధించిన వారిలో హర్ష్‌దీప్‌సింగ్(రెండు కాంస్యాలు), మహాన్యరెడ్డి(రెండు స్వర్ణాలు), అన్విత్(కాంస్యం), ధ్రువిక(స్వర్ణం), నైనికశ్రీ(కాంస్యం) ఉన్నారు. పతక విజేతలను మంగళవారం ఎల్బీ స్టేడియంలో సాట్‌జీ చైర్మన్ శివసేనారెడ్డి అభినందించారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దు

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ సుచరిత

కాప్రా, ఆగస్టు 20: ఆదర్శనగర్ ఖాళీస్థలంలో చెత్తవేయడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తాత్కాలిక డంపింగ్ యార్డును ఇక్కడ నుంచి తొలగించాలని, చెత్త వేస్తే రాంకీ బండ్లను ఇక్కడనుంచి వెళ్లనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. మంగళవారం కాప్రా తహసీల్దార్ సుచరిత, ఇతర అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదర్శనగర్ డంపింగ్‌యార్డును సందర్శించారు. చెత్తడంపింగ్‌తో దుర్వాసన వెలువడుతుందని, దోమల వ్యాప్తి పెరిగి డెంగీ, మలేరియాతో పాటు శ్వాసకోశవ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదర్శనగర్‌లో ఇకపై చెత్తను వేయనీయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కోల్‌కత్తా ఘటనపై జూడాల నిరసన

ఖైరతాబాద్, ఆగస్టు 20: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ ఉస్మానియా, గాంధీ, నిమ్స్, ఈఎస్ఐసీకి చెందిన జూనియర్ డాక్టర్లు మంగళవారం సాయంత్రం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఆవరణలో నిరసన తెలిపారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులెవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 20: దేశంలో మహిళలు, యువతులపై పెరిగిపోతున్న వేధింపులు,లైంగిక దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేంపావని డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఎన్ని చట్టాలు ఉన్నా, అనేక కారణాలతో ఘటనకు బాధ్యులైన వారు తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతికంగా దేశం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ మహిళలకు, యువతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి చేసి హత్యకు పాల్పడిన నిందితులను ఉరితీయాలన్నారు. దేశంలో ఇలాంటి సంఘటనలు పున రావృతం కాకుండా ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.